

ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, చింతా ప్రభాకర్, పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, హనుమంత్‌షిండే, క్రాంతికిరణ్, జాజాల సురేందర్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గంప గోవర్ధన్, భూపాల్‌రెడ్డి తదితరులు

# తెలంగాణ పదాన్నే చెరిపేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి...

పట్ల చెక్కుచెదరని అభిమానం పదిలంగా ఉన్నదని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. జహీరాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవకర్గాల నుంచి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, నియోజకవర్గ, మండలస్థాయి ముఖ్యనాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని తిరిగి ప్రజల అభిమానాన్ని పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు 2001 నుంచి ఇప్పటిదాకా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారని కొనియాడారు. చిన్నచిన్న పొరపాట్ల వల్ల అధికారం కోల్పోయామని, అధికారం రానంత మాత్రాన నిరుత్సాహపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు.

### అధైర్యపడాల్సిన పనిలేదు

ప్రజలు బాగుపడాలని కేసీఆర్ తెచ్చిన విప్లవాత్మక పథకాల దూరదృష్టిని, దార్శనికతను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో కొంత జాప్యం జరిగింద కేటీఆర్ అన్నారు. అందుకే కొన్ని పథకాల లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రజలు కేంద్రంగా పాలన సాగించాలనే ఆలోచనతో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిపెట్టలేకపోయామని చెప్పారు. 1985 –89 మధ్య ఎన్టీఆర్ అనేక మంచి పథకాలు తెచ్చినా, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారని గుర్తుచేశారు. 1989లో ఓడిపోయిన టీడీపీ, ఆ తర్వాత మొదటి విడతలో జరిగిన 21 ఎంపీ సీట్ల ఎన్నికల్లో 19 గెలిచిందని తెలిపారు. అలాగే 2009 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అనుకున్నస్థాయిలో ఫలితాలు రాకపోవటంతో తెలంగాణ పని అయిపోయిందని అందరూ భావించారని, కానీ ఆరు నెలల్లోనే పరిస్థితి అంతా తారుమారైందని గుర్తుచేశారు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చిన సీట్ల సంఖ్య తక్కువేం కాదని, మూడింట ఒక వంతు గెలిచామని తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బీఆర్‌ఎస్ కన్నా 18 వేల ఓట్ల ఆధిక్యమే ఉన్నదని చెప్పారు.

### కేసీఆర్‌పై చెక్కుచెదరని అభిమానం

'మా ఎమ్మెల్యే ఓడిపోయినా కేసీఆర్ ముఖ్యమంత్రి అయితడనుకున్నం. గిట్లయ్లాయే' అని ప్రజలు బాధ పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రజల్లో కేసీఆర్‌పై చెక్కుచెదరని అభిమానానికి అదే నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బలంగా లేకపోతే కొన్ని శక్తులు తెలంగాణ పదాన్నే మాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. తెలంగాణ సమాజం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల్లోనే అప్రతిష్ఠ మూటగట్టుకున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అప్పుడే ప్రజల నుంచి నిరసన సెగలు వస్తున్నాయని అన్నారు. అప్పుల బూచి చూపి హామీల నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంటుందని, దీంతో బీఆర్‌ఎస్‌కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగులను మార్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం బలంగా ఉన్నా అనివార్య కారణాల వల్ల ఆ పని చేయలేకపోయామని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగనివ్వబోమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల సంఖ్య తగ్గిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన అనాలోచితమైనదని విమర్శించారు. అలా చేస్తే ప్రజల పక్షాన నిలబడాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు.

### పార్టీ ప్రక్షాళన జరగాలి: పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పార్టీలో ప్రక్షాళన జరగాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలహీనతలే కాంగ్రెస్ పార్టీ విజయానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ కొందరు సొంత అభ్యర్థులనే ఓడించుకోవటం దారుణమని అన్నారు. బీఆర్‌ఎస్ ఓటమికి నాయకులదే బాధ్యత అని తెలిపారు. నాయకులు నిత్యం ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో ఉండక, వారి మనోభావాలను గౌరవించుకోవటంలో విఫలమైన కారణంగానే ఓటమి చెందామని విశ్లేషించారు. దేశంలో బీఆర్‌ఎస్‌కు ఉన్న బలమైన క్యాడర్ మరే రాజకీయ పార్టీకి లేదని తెలిపారు. తప్పులను ఎత్తిచూపినవాడే నిజమైన కార్యకర్త అని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటితే 16 సీట్లు రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, ఎంపీ బీబీ పాటిల్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతాప్రభాకర్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మత్‌షిండే, జాజుల సురేందర్, చంటి క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ వల్లే పార్లమెంట్‌లో తెలంగాణ గళం: హరీశ్‌రావు

పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించే సత్తా బీఆర్‌ఎస్‌కే ఉన్నదని, అదే మన బలమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయినా పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలనే ఉత్సాహం గులాబీ సైన్యంలో తొణికిసలాడుతున్నదని తెలిపారు. పార్టీ సన్నాహక సమావేశాలే అందుకు నిదర్శమని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోపాలను సవరించుకొని, పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధితోపాటు ఢిల్లీలో కేంద్రంతో తెలంగాణ సమస్యలపై బీఆర్‌ఎస్ చేసిన పోరాటాన్ని ప్రజలకు గుర్తు చేసి ఓట్లు అడుగుదామని చెప్పారు.

పార్లమెంటులో తెలంగాణ గళం వినబడాలంటే బీఆర్‌ఎస్ ఎంపీల సంఖ్య బలంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీల సంఖ్య తగ్గితే కాంగ్రెస్, బీజేపీ ఆడింది ఆట పాడింది పాట అవుతుందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. 'తెలంగాణ పాలిట బీజేపీది మొండి చెయ్యి..కాంగ్రెస్‌ది తొండి చెయ్యి' అని ఆయన విమర్శించారు. రాష్ట్ర హక్కులు ఢిల్లీలో సాధించుకోవాలంటే బీఆర్‌ఎస్‌కే ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు.



జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ముచ్చటిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కే కేశవరావు

### సీఎం అయినా పీసీసీ చీఫ్‌లాగే రేవంత్

కేంద్రంలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు రాజకీయాలను పట్టించుకోరని సీఎం రేవంత్‌రెడ్డి నీతులు చెప్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఎంపీగా ఉన్నప్పుడు తెలంగాణకోసం రేవంత్‌రెడ్డి ఏంచేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్రంతో కొట్లాడుతున్నప్పుడు రేవంత్‌రెడ్డి ఎక్కడున్నారని నిప్పులు చెరిగారు. పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడు బీఆర్‌ఎస్‌పై బట్టగాల్చి మీదవేసి, సీఎం హోదాలోనూ అదేపనిచేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఎవరిని కలిసినా బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కయ్యాయని అడ్డగోలు ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు సీఎంగా నాడు బీఆర్‌ఎస్ సర్కార్ చేసిన పనినే చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం మంచిపనులు చేయదు.. బీఆర్‌ఎస్ చేసిన మంచి పనులను తుడిపేస్తాం అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. దేశంలో ఎవరూ అమలు చేయని కేసీఆర్ విప్లవాత్మక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద రోజుల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పప్పులు ఉడకవని అన్నారు.

## కాంగ్రెస్ పాలనలో యూరియా కొరత

- ప్రజలను మోసం చేయొద్దు
- హామీలన్నీ అమలుచేయాలి
- మేము గెలిచినా, ఓడినా ప్రజాపక్షమే
- గృహలక్ష్మి లబ్ధిదారులను 'ఇందిరమ్మ' పథకంలో చేర్చాలి
- జహీరాబాద్ సమీక్ష అనంతరం పోచారం



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పోచారం, బీబీ పాటిల్

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యూరియా కొరత మొదలైందని దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మళ్లీ రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజులుగా సమీక్షలు, ఢిల్లీ పర్యటనల పేరిట సమయం వృథా చేస్తున్నదని, హామీల అమలుపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గెలిచినా ఓడినా తమది ప్రజాపక్షమేనని, ప్రజల పక్షాన ప్రశ్నిస్తామని చెప్పారు. ఆదివారం తెలంగాణభవన్‌లో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జెడ్పీ చైర్మన్లు రాజు, శోభతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాత పథకాలను రద్దు చేస్తున్నారు తప్ప, కొత్త పథకాల ఊసే లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేశారని, ఎంపికైన లబ్ధిదారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గృహలక్ష్మి లబ్ధిదారులను ఇందిరమ్మ పథకం కిందకు చేర్చి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మరే హామీ అమలు కావడం లేదని దుయ్యబట్టారు. రైతుబంధు ఇంకా ఎవరికీ సరిగా అందలేదని, రైతు రుణమాఫీ గురించి ఊసే లేదని విమర్శించారు. వడ్లకు బోనస్ ధర ఏదని నిలదీశారు. ఇలా దగా చేసిన ప్రభుత్వాన్ని ఎపుడూ చూడలేదని చెప్పారు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీ సాక్షిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట మార్చారని మండిపడ్డారు. దీర్ఘకాలిక హామీలపై తాము అడగడం లేదని, తక్షణం పరిష్కరించాల్సిన సమస్యల గురించే మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. మాటలు చెప్పడం కాదు చేతల్లో చూపించాలని సవాల్ విసిరారు. ప్రజలను మోసం చేయొద్దని హితవు చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తులు కోటి 25 లక్షలు దాకా వచ్చాయని, దరఖాస్తుల పేరిట ప్రజలను ఇబ్బంది పెట్టారు తప్ప వారికి ప్రయోజనం కలగలేదని దుయ్యబట్టారు. కాలయాపన కోసమే ట్రంకు పెట్టెల్లో దరఖాస్తులు పెట్టారని, ప్రజల మోచేతికి బెల్లం పెట్టి దాట వేసే వైఖరితో ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. ఎన్నికల కోడ్ వచ్చే దాకా కాలయాపన చేసి, ఏడాది దాకా హామీలను ఎగ్గొట్టే ప్రక్రియ నడుస్తున్నదని పేర్కొన్నారు.

## లోపాలను అధిగమించి ముందుకు సాగుదాం: నిరంజన్‌రెడ్డి

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గతంలో జరిగిన లోపాలను అధిగమించి ముందుకు సాగుదామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కార్యకర్తలకు ఉద్బోధించారు. సంప్రదాయ రాజకీయాల మాదిరిగా కేసీఆర్ రాష్ర్టాన్ని పాలించలేదని, ప్రజలకు శాశ్వత ప్రయోజనాలు కల్పించాలనే దార్శనికతతో పాలించారని తెలిపారు. రాష్ట్ర సత్వర అభివృద్ధికి పట్టుదలతో పనులు చేసినా ఓడిపోయామని, ఈ ఓటమికి గల కారణాలను లోతుగా విశ్లేషించుకొని పొరపాట్లకు తిరిగి ఆస్కారం లేకుండా చూడాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన సొంతబలంతో గెలవలేదనే విషయాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు గుర్తించాలని సూచించారు. 'గుంపు మేస్త్రీ తెలివి తేటల వల్ల కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు, మన తప్పిదాల వల్లే బీఆర్‌ఎస్ ఓడిపోయింది' అని తెలిపారు.

# సామాన్యుడి ఇంట్లో కేటీఆర్ లంచ్

- ఎక్స్‌లో ఆహ్వానంతో బోరబండకు
- ఆతిథ్యం స్వీకరించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- మురిసిన ఇబ్రహీంఖాన్ కుటుంబం
- మీ దివ్యాంగ పిల్లల చికిత్స బాధ్యత నాదేనన్న కేటీఆర్



ఇబ్రహీంఖాన్ ఇంట్లో భోజనం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గోపీనాథ్

హైదరాబాద్ సిటీబ్యూరో/ఎర్రగడ్డ, జనవరి 7 (నమస్తే తెలంగాణ): తన ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించాలన్న ఓ సామాన్యుడి కోరికను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు నెరవేర్చారు. హైదరాబాద్‌లోని బోరబండలో గాజుల దుకాణం నడిపే ఇబ్రహీంఖాన్ ఇంటికి కేటీఆర్ వెళ్లి కుటుంబంతో కలిసి భోజనం చేశారు. ప్రజా జీవితంలో ఇలాంటి ఆహ్వాన ఘటనలు మరింత నిబద్ధతతో ప్రజల కోసం కష్టపడేలా స్ఫూర్తినిస్తాయని కేటీఆర్ చెప్పారు. అసలు విషయం ఏమిటంటే.. ఈ నెల 2న నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేటీఆర్‌కు ఇబ్రహీంఖాన్ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. పదేండ్లుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా రాష్ట్రాభివృద్ధికి అద్భుతంగా పని చేశారని తెలిపారు. దురదృష్టవశాత్తు బీఆర్‌ఎస్ ఎన్నికల్లో గెలవలేదని, ఈ ఐదేండ్ల కాలం ఒక సినిమాలో ఇంటర్వెల్ మాదిరి గడిచిపోతుందని పేర్కొన్నారు. పదేండ్లు రాష్ర్టానికి అందించిన సేవలకు తన ఇంట్లో ఆతిథ్యం స్వీకరించాలని కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. ఇంటికి వస్తానని ఇబ్రహీంఖాన్ ఇచ్చిన మాట మేరకు.. ఆదివారం వెళ్లారు. కేటీఆర్‌కు ఇబ్రహీంఖాన్ కుటుంబ సమేతంగా స్వాగతం పలికారు. ఖాన్ కుటుంబసభ్యులతో కలిసి కేటీఆర్ భోజనం చేశారు. దివ్యాంగులైన తన పిల్లలకు అసరా పెన్షన్ అందించాల్సిందిగా గతంలో ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేస్తే వెంటనే కేటీఆర్ కార్యాలయం స్పందించి ఫించన్ మంజూరు చేయించిన విషయాన్ని కుటుంబం గుర్తుచేసి సంతోషాన్ని వ్యక్తం చేసింది.

### ఇంటికి ఆహ్వానించడం సంతోషం

ఇబ్రహీంఖాన్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కేటీఆర్ తనకు ఆతిథ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇబ్రహీంఖాన్ పిల్లలకు చెవుడు, మూగ ఉన్నందున వారికి అవసరమైన చికిత్స ఖర్చులు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఒక సాధారణ పౌరుడు తమ ప్రభుత్వ సేవలకు గుర్తింపుగా తన ఇంటికి ఆహ్వానించడం తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఉన్నారు. కేటీఆర్ కోసం ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు అక్కడ పెద్దసంఖ్యలో గుమిగూడారు.

# ఇంటిపేరు ఒక్కటైతే చుట్టమా?

- జాబొచ్చిన అమ్మాయితో బంధుత్వం నిరూపిస్తారా?
- ఎన్నికల వేళ బద్నాం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర
- తప్పుడు పని చేయాలని అధికారులను కోరలేదు
- ఆధారాలు లేకుండా అవాస్తవాల ప్రచారమా?
- ప్రెస్‌మీట్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆగ్రహం



కరీంనగర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 7: కేవలం ఇంటిపేరు ఒక్కటైనందుకే బంధుత్వం అంటగట్టి విద్యుత్తు శాఖలో ఉద్యోగం ఇప్పించారంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఎన్నికల వేళ తనను బద్నాం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. ఈ తప్పుడు సమాచారంతో వార్తలను ప్రచారం చేసిన వారు ఉద్యోగం పొందిన అమ్మాయితో తనకు బంధుత్వం ఉన్నట్టు నిరూపిస్తారా? అని ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రతిమ మల్టిప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు సీఎండీ ప్రభాకర్‌రావు ఉద్యోగం ఇచ్చినట్టుగా చెప్తున్న బోయినపల్లి సరితకు, తనకు ఎలాంటి బంధుత్వమూ లేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంటిపేరు ఒక్కటైనంత మాత్రాన బంధువులవుతారా? అంటూ ప్రశ్నించారు. దీనిని బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు సోషల్ మీడియాలో వైరల్ చేసి తనను బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలు వస్తున్నందునే తనపై బండి సంజయ్ కావాలనే వాళ్ల కార్యకర్తలతో ఇలాంటి చీప్ ప్రచారం చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక వార్త ప్రసారం చేసేముందు సమగ్ర సమాచారం తెలుసుకోవాలని, ఆ తర్వాతనే దానిని పబ్లిష్ చేయాలని తీన్మార్ మల్లన్నకు హితవుపలికారు. కచ్చితమైన ఆధారాలు తెలుసుకోకుండా ఇలా వార్తలను ప్రసారం చేయడం జర్నలిజం అనిపించుకోదని సూచించారు. దీనిని ప్రసారం చేసే ముందు తనకు ఫోన్ చేసినా, కనీసం మెసేజ్ చేసినా సమాధానం ఇచ్చేవాడినని పేర్కొన్నారు. తన 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ తప్పును ప్రోత్సహించలేదని, చట్టవ్యతిరేకమైన పని చేయాలని ఏ అధికారినీ కోరలేదని వివరించారు. తనకు అన్నే లేదని, ఇక ఆ అమ్మాయికి తనకు బంధుత్వం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బోయినపల్లి ఇంటి పేరు ఉన్నంత మాత్రాన బంధుత్వం ఎలా అంటగడతారని ఫైర్ అయ్యారు. ఆర్థిక నేరగాడు నీరవ్ మోదీ దేశంలో రూ.లక్షల కోట్లు దండుకొని ఇప్పుడు లండన్‌లో ఉంటున్నారని, మరి ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ బంధువులు అవుతారా? అనే విషయాన్ని బీజేపీ సోషల్ మీడియా మిత్రులు గ్రహించాలని చురకలంటించారు. రాజకీయ పోరాటం ఉండాలి కానీ, తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని నిలదీశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎవరు ఏం అభివృద్ధి చేశారు? ఏం పనులు చేశాం? అనే అంశాలపై మాట్లాడుకుందామని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ గళం ఎందుకుండాలంటే?

- పదేండ్లలో రెండు సభల్లో గులాబీ ఎంపీలు అడిగిన ప్రశ్నలు 4,754
- కాంగ్రెస్ అడిగింది 1,271, బీజేపీ ఎంపీలు అడిగిన ప్రశ్నలు 190

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): 'మనమే తెలంగాణ గళం.. మనమే తెలంగాణ దళం.. మనమే తెలంగాణ బలం' అని బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లోకి బలంగా తీసుకెళ్తున్నది. బీఆర్‌ఎస్సే ఎప్పటికైనా తెలంగాణ కు టార్చ్‌బేరర్ అని స్పష్టం చేస్తున్నది. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను ఎప్పటికైనా పరిరక్షించేది బీఆర్‌ఎస్సేనని ఆధారాలతో సహా పార్టీ శ్రేణులకు వివరిస్తున్నది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఎందుకు గెలిపించాలో అన్ని స్థాయిల పార్టీ శ్రేణుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నది. తెలంగాణ ప్రజల పట్ల కాంగ్రెస్, బీజేపీలకు ఏమాత్రం పట్టింపులేదని ఆధారాలతో వివరిస్తున్నది. అందుకు



2014–19 (16వ లోక్‌సభ), 2019–2024 (17వ లోక్‌సభ)లో రాష్ట్రం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు లోక్‌సభలో అడిగిన ప్రశ్నలను ప్రజలు ముందు ఉంచుతున్నది. లోక్‌సభ, రాజ్యసభల్లో కాంగ్రెస్ ఎంపీలు అడిగింది 1,271 ప్రశ్నలేనని, బీజేపీ ఎంపీలు కేవలం 190 ప్రశ్నలే అడిగి చేతులు దులుపుకున్నారని బీఆర్‌ఎస్ మండిపడుతున్నది. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రాన్ని నిలదీయడంతో ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించింది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేస్తున్నది. రెండు సభల్లో బీఆర్‌ఎస్ 4,754 ప్రశ్నలు అడిగి, కేంద్రాన్ని నిలదీసిన ఉదంతాలను వివరిస్తున్నది.

**రెండు సభల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు అడిగిన ప్రశ్నల సంఖ్య**

| పార్టీ | 17వ లోక్‌సభ | 16వ లోక్‌సభ | మొత్తం |
|---|---|---|---|
| బీఆర్‌ఎస్ | 2,028 | 2,726 | 4,754 |
| కాంగ్రెస్ | 734 | 537 | 1,271 |
| బీజేపీ | 178 | 12 | 190 |

# ఆరేండ్లలో 63% వృద్ధి

మొదటిపేజీ తరువాయి...

కారణం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంస్కరణలతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని సాధించడంతో రాష్ట్ర ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ఎన్నో రంగా ల్లో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించింది. దీంతో ఆది నుంచే జీఎస్టీ వసూళ్లలో సత్తా చాటుతున్న రాష్ట్రం.. కొవిడ్ సంక్షోభ సమయంలోనూ వెనుకంజ వేయలేదు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.31,187 కోట్ల జీఎస్టీ వసూలవుతుందని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేయగా.. తొలి ఎనిమిది నెలల్లో రూ.18,218 కోట్లు వసూలయ్యాయి. కానీ, 2020–21లో జీఎస్టీ వసూళ్లు స్వల్పంగా తగ్గడంతో ఆ ఆర్థిక సంవత్సరంలోని తొలి 8 నెలల జీఎస్టీ రాబడి రూ.15,247 కోట్లకే పరిమితమైంది. అయినప్పటికీ ఇది మిగిలిన రాష్ర్టాల కంటే మెరుగైన రాబడే. ఆ తర్వాత నుంచి మరింత జోరు పెంచిన తెలంగాణ.. 2021–22 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఎనిమిది నెలల్లో రూ.20,859 కోట్లు, 2022–23లో నవంబర్ వరకు రూ.27,287 కోట్ల జీఎస్టీ వసూలు చేసింది.

**ఈ ఆర్థిక సంవత్సరంలో నెలవారీ వసూళ్లు జీఎస్టీ (రూ.కోట్లలో)**

| నెల | వసూళ్లు | నెల | వసూళ్లు |
|---|---|---|---|
| ఏప్రిల్ | 4,081.79 | ఆగస్టు | 3,529.58 |
| మే | 3,348.26 | సెప్టెంబర్ | 3,889.70 |
| జూన్ | 3,988.42 | అక్టోబర్ | 3,764.10 |
| జూలై | 3,806.05 | నవంబర్ | 3,639.69 |

మొత్తం **30,047.59**

**రాష్ట్రంలో జీఎస్టీ వృద్ధి తీరు**

| ఆర్థిక సంవత్సరం | బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో) | తొలి 8 నెలల రాబడి (రూ.కోట్లలో) | అంచనాలో శాతం |
|---|---|---|---|
| 2018-19 | 34,232.93 | 18,964.23 | 64.30 |
| 2019-20 | 31,186.67 | 18,218.47 | 58.42 |
| 2020-21 | 32,671.62 | 15,247.17 | 46.67 |
| 2021-22 | 35,520.30 | 20,859.43 | 58.73 |
| 2022-23 | 42,189.47 | 27,287.07 | 64.68 |
| 2023-24 | 50,942.66 | 30,047.59 | 58.98 |

### 8 నెలల్లో రూ.30,047.59 కోట్లు


ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రాష్ట్రం ఆరంభం నుంచే జీఎస్టీ వసూళ్లలో జోరు ప్రదర్శించడంతో ఏప్రిల్‌లో రూ.4,082 కోట్ల రాబడి వచ్చింది. ఇది గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో వసూలైన జీఎస్టీ కంటే రూ.694 కోట్లు ఎక్కువ. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా ఉండటంతో నవంబర్ వరకు సగటున నెలకు రూ.3,500 కోట్ల చొప్పున మొత్తం రూ.30,047.59 కోట్ల రాబడి వచ్చింది. ఇది రాష్ట్ర బడ్జెట్ అంచనాలో 59 శాతానికి సమానం.

## ఎల్‌ఈడీ వీధి దీపాల్లో తెలంగాణ టాప్ –2

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఎల్‌ఈడీ వీధి దీపాలను అమర్చడంతో తెలంగాణ జాతీయస్థాయిలో టాప్ –2లో ఉన్నట్టు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) సంస్థ ప్రకటించింది. దేశంలోనే అత్యధికంగా 29.47 లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాలను అమర్చి ఏపీ టాప్‌లో నిలవగా, తెలంగాణ 16.82 లక్షలు అమర్చినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈఈఎస్‌ఎల్ 9వ వార్షికోత్సవంలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉజాలా పథకం కింద 36.86 కోట్ల ఎల్‌ఈడీ బల్బులు, 72.18 లక్షల ట్యూబ్‌లైట్లు, 23.59 లక్షల ఫ్యాన్లను పంపిణీ చేసినట్టు చెప్పింది.

# దేవుడి పేరిట దరఖాస్తు

- గ్యారెంటీ స్కీమ్‌ల కోసం వినతి
- ఫారంపై శివుడి ఫొటో..
- రసీదిచ్చిన అధికారులపై విమర్శలు
- ముత్తారంలో వెలుగుచూసిన ఘటన
- సామాజిక మాధ్యమాల్లో వైరల్




భీమదేవరపల్లి, జనవరి 7: కాంగ్రెస్ సర్కార్ అమలు చేయనున్న ఆరు గ్యారెంటీల కోసం సాక్షాత్తు దేవుడే దరఖాస్తు చేసుకున్నాడు. శివయ్య పేరిట ఏకంగా శివుడి ఫొటోతో దరఖాస్తు వచ్చినా అధికారులు స్వీకరించి రసీదు కూడా అందజేశారు. ఈ వ్యవహారంలో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నది. అధికారులు దరఖాస్తు తీసుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారంలో ఓ వ్యక్తి ఏకంగా శివయ్య (పరమ శివుడు) పేరిట ప్రజాపాలనలో దరఖాస్తు చేశాడు. దరఖాస్తుదారు శివయ్య అయితే అతని భార్య పార్వతీదేవి, కుమారులు కుమారస్వామి, వినాయకుడిగా పేర్కొన్నాడు. దరఖాస్తు ఫారంపై శివుడి ఫొటోను అతికించాడు. శివుడి పుట్టిన తేదీ 01–01–1200గా పేర్కొన్నాడు. ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం దరఖాస్తు చేశాడు. దరఖాస్తు ఫారం తీసుకున్నవాళ్లు రసీదు ఇవ్వడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. శివయ్య పేరిట దరఖాస్తు ఫారం తానే ఇచ్చినట్టు అదే గ్రామానికి చెందిన ఏనుగు వెంకట సురేందర్‌రెడ్డి అంగీకరించారు. ముత్తారంలో కాకతీయులు నిర్మించిన అతి ప్రాచీన త్రికూటాలయం ఉన్నదని, ఆలయ పునరుద్ధరణకు ఒక గది, విద్యుత్తు ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలనే తాను ఈ పనిచేశానని పేర్కొన్నాడు. ఇందులో అధికారుల తప్పిదం లేదని, సర్పంచ్ రేణికుంట్ల శాంతికుమార్‌కు లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణలో అధికారుల అలసత్వం బట్టబయలైందని, దరఖాస్తులు పరిశీలిస్తే అధికారులు రసీదు ఎలా ఇస్తారని పలువురు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు.